మహానాడు ఏర్పాట్ల పరిశీలన



మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

సీకేదిన్నె, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమానికి సంబంధించి చెర్లోపల్లెలో చేపట్టిన ఏర్పాట్లను కమలాపురం, కడప ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి బుధవారం పరిశీలించారు. టీడీపీ ఏర్పడ్డాక మొట్టమొదటిసారి కడప జిల్లాలో మహానాడు ఏర్పాటు చేస్తుండడంతో ఏర్పాట్లను ప్రత్యేకంగా దగ్గరుండి చూస్తున్నారు. సభాప్రాంగణ వేదికనంతా చదును చేయించి సిద్ధం చేస్తున్నారు. భూమి పూజకోసం అంతా సిద్ధం చేశారు. కూలీలతో చిన్నచిన్న కంపచెట్లు సైతం లేకుండా తొలగిస్తూ డ్రోజర్లతో లెవలింగ్ కార్యక్రమాన్ని చేయిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, మోహన్‌బాబు, నారాయణ, రాజా, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎస్పీ అశోక్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశ స్వాతంత్ర్యోదమ పోరాటంలో అల్లూరి పాత్ర కీలకమైందని, పరిమిత వనరులతో బ్రిటీష వారిని గడగడలాడించిన పోరాటయోధుడని కొనియాడారు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్‌ఐలు ఆనంద్, టైటస్, వీరేశ్, శ్రీశైలరెడ్డి, శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో.. రింగుమంటోంది



కడప సెంట్రల్ జైలు వివాదాలకు కేరాఫ్‌గా మారింది. అక్కడ ఖైదీలు, రిమాండ్ ఖైదీలు సెల్‌ఫోన్లను విచ్చలవిడిగా వాడుతున్నారు. అది కూడా ఒక్కరి దగ్గరే తొమ్మిదిసార్లు సెల్‌ఫోన్లు దొరకడం విశేషం. తనిఖీల్లో ముద్దాయి నుంచి సెల్‌ఫోను స్వాధీనం చేసుకోగా.. మీరు తీసుకెళితే తీసుకోండి, మరలా తెచ్చుకుంటా అని అతను సవాలు చేసే స్థాయికి వచ్చిందంటే సెంట్రల్ జైలులో నిఘా డొల్లతనం బయటపడుతోంది. ఎర్రచందనం కేసులో పీడీ యాక్టు నమోదై సెంట్రల్ జైలులో ఉన్న వ్యక్తి వద్ద ఆదివారం సెల్‌ఫోను దొరికింది. దీంతో అందుకు బాధ్యులైన డిప్యూటీ జైలరు, వార్డెన్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. అయితే ఆ విషయం మాత్రం బయటికి తెలియకుండా గుట్టుగా ఉంచడం గమనార్హం. ఇదొకటే అనుకుంటే పొరపాటే.. అక్కడ రాజా ప్యాకెట్లు, బీడీలు, సిగరెట్లు విచ్చలవిడిగా దొరుకుతున్నట్లు ప్రచారం ఉంది.



- విచ్చలవిడిగా సెల్‌ఫోన్ల వినియోగం
- ఒక్క ఖైదీ వద్దనే తొమ్మిదిసార్లు సెల్‌ఫోన్లు పట్టుబడిన వైనం
- డిప్యూటీ జైలరు, వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు

(కడప-ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో హత్య కేసులు, ఇతరత్రా కేసుల్లో శిక్ష పడ్డ వారందరినీ సెంట్రల్ జైలుకు తీసుకువస్తారు. ప్రస్తుతం శిక్ష పడ్డ ఖైదీలు, రిమాండు ఖైదీలు, పీటీ వారంటు కలిగిన వారు కలిసి 630 మందికి పైగా ఉన్నారు. కరుడుగట్టిన నేరస్తులను 'కావేరి' బ్యారక్‌లో ఉంచుతారు. జైల్లో తప్పు చేసిన ఖైదీలనూ కావేరి బ్యారక్‌లో వేస్తారు. ప్రత్యేక అనుమతులు తీసుకున్న వారు 'తుంగభద్ర'లో ఉంటారు. 'స్నేహసరోవర్'లో మంచి నడవడిక కలిగిన వారు, బయట పెట్రోలుబంకు, క్లీనింగ్, డెయిరీఫాంలో పనిచేసే వారు ఉంటారు.

సెల్‌ఫోన్ల వినియోగం

సెంట్రల్ జైలులో సెల్‌ఫోన్లు విచ్చలవిడిగా వినియోగించం పెద్ద దుమారం రేపుతోంది. చాపాడు మండలం కదిరేపల్లెకు చెందిన జాకీర్ పీడీ యాక్టుతో ఏడాదిగా తుంగభద్ర బ్యారక్‌లో ఉంటున్నారు. అతని వద్ద ఇప్పటి వరకు 8 ఫోన్లు దొరికినట్లు సమాచారం. నాలుగురోజుల క్రితం జైళ్ల భద్రతపై విజయవాడలో కొత్త డీజీ అధ్యక్షతన సమావేశం జరిపారు. జైళ్లలో ఖైదీలకు అదనపు వసతులతో పాటు ఇల్లీగల్ యాక్ట్ ఉంటే సూపరింటెండెంట్‌లే అందుకు బాధ్యులని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆదివారం జైల్లో తనిఖీ చేయగా జాకీర్ ఉండే బ్యారక్‌లో ఓ టచ్ ఫోను దొరికింది. అందుకు బాధ్యులుగా డిప్యూటీ జైలరు, వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. జాకీర్ వద్ద సెల్‌ఫోను దొరకడం ఇది తొమ్మిదోసారి. అలాగే 20రోజుల క్రితం ఒక హత్య కేసులో జైల్లో ఉన్న వ్యక్తి వద్ద కూడా సెల్‌ఫోను దొరికినట్లు సమాచారం. ఈ విషయాన్ని బయటకు పొక్కనివ్వలేదు.

'రాజ' ప్యాకెట్ రూ.500

డబ్బులు పెట్టే స్థోమత ఉంటే చాలు.. సెంట్రల్ జైలులో రాజ ప్యాకెట్లు, బీడీలు, సిగరెట్లు విచ్చలవిడిగా దొరుకుతాయన్న ప్రచారం ఉంది. రాజ ప్యాకెట్ రూ.500 నుంచి రూ.700, ఒక సిగరెట్ రూ.100, కట్ట బీడీలు రూ.500లకు అమ్ముతున్నట్లు సమాచారం. జైల్లో తుంగభద్ర, స్నేహసరోవర్, కావేరి బ్యారక్‌లు ఒకేచోట ఉన్నాయి. ఖైదీలు ఈ బ్యారక్‌ల నుంచి బయటికి వచ్చినప్పుడు అందరూ కలిసే ఉంటారు. వీరందరికీ రాజ ప్యాకెట్ రూ.500కు అమ్ముతున్నారని అంటున్నారు. శిక్షపడ్డ ఖైదీలు గంగ, యమున, సరస్వతి బ్యారక్‌లలో ఉంటారు. వారు లోపలే ఉంటారు. అక్కడ రాజ ప్యాకెట్ రూ.700కు అమ్ముతున్నట్లు సమాచారం. ఇటీవల తనిఖీల్లో ఓ హెడ్ వార్డెన్ 'సీక్యాప్'లో 18 రాజ ప్యాకెట్లు బయటపడినట్లు సమాచారం. అతడిని మందలించి వదిలేయడంతో మిగతా సిబ్బంది కూడా ఇదేబాట పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. జైలు ఆవరణలో బేకరీ ఉంది. ఇందులో బిస్కెట్లు, కేకులు, ఇతర తినుబండారాలు తయారుచేస్తారు. వీటికి అవసరమైన నూనె, చక్కెర డాల్డా ఇతరత్రా బయట నుంచి ఆటోల ద్వారా లోపలికి తీసుకు పోతారు. వీటిద్వారా రాజ, సిగరెట్స్, బీడీలు వస్తున్నట్లు సమాచారం.



ఇద్దరి సస్పెన్షన్

పీడీ యాక్ట్ నమోదైన జాకీర్ వద్ద దొరికిన సెల్‌ఫోను, సిమ్‌కార్డును జైలు సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావు రిమ్స్ పోలీసులకు సరెండరు చేశారు. ఇందులోని కాల్ డేటా బయటికి వస్తే ఎవరెవరు జైలు నుంచి మాట్లాడారు, ఎర్రచందనం స్మగ్లర్లు, పొలిటికల్ లీడర్స్ ఎంతమంది మాట్లాడారో వెలుగులోకి వస్తుంది. ఈ విషయమై జైలు సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. బ్యారక్ సమీపంలో పాత సెల్ దొరికిందని, దీనిపై రిమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు. సిగరెట్లు, రాజాల వినియోగం అవాస్తవమన్నారు. పటిష్ఠమైన నిఘా ఉంచామని, ప్రతి ఒక్కరినీ తనిఖీ చేస్తున్నామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డిప్యూటీ జైలర్ హరినాధ్, వార్డెన్ సుబ్బరాయుడును సస్పెండ్ చేశామన్నారు.

వసతిగృహ విద్యార్థినికి సత్కారం



సత్కారం అందుకున్న బిందులతతో హాస్టల్ వార్డన్ నాగేశ్వరమ్మ

పులివెందుల, మే 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ విద్యార్థిని ఎ.బిందులతకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి, రాష్ట్ర కమిషనర్ లావణ్య ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం అమరావతిలోని తుమ్మలపల్లె కళాక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు అనేక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. 10వ తరగతిలో పులివెందుల హాస్టల్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతమ్మ, ఏఎస్‌డబ్ల్యూఓ రామాంజనేయులు, హాస్టల్ వార్డన్ నాగేశ్వరమ్మలను మంత్రి, కమిషనర్ అభినందించారు.

ఎక్కడా తాగునీటి సమస్య రాకూడదు

కడప కలెక్టరేట్, మే 7(ఆంధ్రజ్యోతి): వేసవిలో జిల్లాలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో జిల్లా నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న వివిధ రకాల పనులు, పురోగతిపై జేసీ అదితిసింగ్‌తో కలసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవోలు, ఏపీవోలు వారు పనిచేసే మండలాల్లోనే నివాసాలు ఉంటూ పూర్తి స్థాయిలో విధులు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది చివరి నాటికి 60 వేల ఎకరాల్లో ఉద్యాన మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా అధికారులు సమన్వయంతో చేపట్టాలన్నారు. వచ్చే ఏడాదిలోగా లక్ష ఎకరాలు సాగులోకి తేవాలన్నారు. రానున్న మూడు నెలల్లో ఎంపిక చేసిన 100 గ్రామాల్లో మొత్తం పచ్చదనంతో నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులు, ఉద్యాన శాఖ డీడీ సుభాషిణి, జడ్పీ సీఈవో ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించాలి



మాక్‌డ్రిల్‌పై మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి చిత్రంలో ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, మే7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలకు ముందస్తుగా భద్రతపై మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం సివిల్ మాక్‌డ్రిల్ అంశంపై జూమ్ వీడియా కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. కేంద్ర మంత్రిత్వ శాఖ నిర్దేశించిన సివిల్ డిఫెన్స్ రూల్స్ ప్రకారం జిల్లాలో పౌర రక్షణకై ప్రజలకు అగాహన కల్పిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఆ మేరకు జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, ఫైర్, మెడికల్ మొదలైన ఎమర్జెన్సీ సర్వీసులు ఇతర అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు.

కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి నిర్వహించిన ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితి సింగ్, ఫైర్ అధికారి ధర్మారావు, పరిశ్రమల జీఎం చాంద్ బాషా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన బ్రహ్మంగారిమఠం

- వేడుకగా గురుపూజా మహోత్సవాలు

7

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన అరటి
- కల్లాల్లోనే తడిచిన వరి ధాన్యం

రైతుల ఆశలు ఆవిరి

6

నేడు అధికార లాంఛనాలతో పాలకొండ్రాయుడు అంత్యక్రియలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మే 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు అంత్యక్రియలను అధికార లాంఛనాలతో గురువారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు మంగళవారం ఉదయం మరణించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయన అంత్యక్రియలను అధికార లాంఛనాలతో గురువారం ఉదయం నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్ల కోసం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఇతర అధికారులకు వివిధ సూచనలు చేసినట్లు తెలిపారు.

అభివృద్ధికి అడుగు పడేనా..?

- ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో నెగ్గని టీడీపీ కౌన్సిలర్ల తీర్మానాలు
- ఒక్క అభివృద్ధి పనికైనా టెంకాయ కొట్టని వైనం



ప్రొద్దుటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా.. స్థానిక సంస్థలైన పంచాయతీలు, మండలాలు, మున్సిపాలిటీలు నేటికీ వైసీపీ చేతిలోనే ఉన్నాయి. కొన్ని చోట్ల టీడీపీ ఎమ్మెల్యేలు మున్సిపాలిటీలను తమ రాజకీయ చతురతతో టీడీపీ ఖాతాలో వేసుకుంటున్నారు. కానీ ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో టీడీపీకి చుక్కెదురవుతోంది. దీంతో కౌన్సిల్లో తామనుకున్న పనులను టీడీపీ ఆమోదించుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా మున్సిపాలిటీలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఒక్క అభివృద్ధి పనికైనా టెంకాయ కొట్టలేని పరిస్థితి ఏర్పడింది.

నెగ్గని టీడీపీ కౌన్సిలర్ల తీర్మానాలు

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో మొత్తం కౌన్సిలర్లు 40 మందిలో టీడీపీకి 16 మంది ఉన్నారు. ఒకరు జనసేన, మరొకరు కాంగ్రెస్ సభ్యులు కూడా టీడీపీకి మద్దతుగా ఉంటున్నారు. వైసీపీకి 22 మంది ఉన్నారు. మెజారిటీ సభ్యులు లేకపోవడంతో టీడీపీ అనుకున్న పనులకు సంబంధించిన తీర్మానాలు కౌన్సిల్ ఆమోదానికి నోచుకోవడం లేదు. దీంతో మున్సిపాలిటీలో టీడీపీ మెజారిటీ సాధించాలంటే మరో ముగ్గురు కౌన్సిలర్లు అవసరం. టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి గట్టిగా ప్రయత్నిస్తే అది సాధ్యమవుతుందని క్యాడర్ అభిప్రాయ పడుతోంది.

మున్సిపాలిటీలో టీడీపీ లీడర్ ఎవరు?

మున్సిపాలిటీలో టీడీపీ కౌన్సిల్ సభ్యులను నడిపించేందుకు లీడరెవరు..? అనే చర్చ నడుస్తోంది. ప్రతి సమస్యకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని సంప్రదించాలంటే కౌన్సిలర్లకు సాధ్యపడటం లేదు. ఒక కౌన్సిల్ సమావేశానికి మాత్రం వంగనూరు మురళీధర్‌రెడ్డికి అధ్యక్షత అవకాశం ఇచ్చారు. ఆ తరువాత మున్సిపాలిటీలలో పార్టీ తరుపున ఎవ్వరికీ బాధ్యతలు ఇవ్వకపోవడం వలన ప్రతి పనికి ఎమ్మెల్యేను ఆశ్రయించాల్సి వస్తోందని కొందరు కౌన్సిలర్లు వాపోతున్నారు. వైసీపీకి అధికారికంగా చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు ఉన్నారు. వారు వారి కౌన్సిలర్ల, కార్యకర్తల సమస్యలను కార్యాలయంలో కూర్చొని ప్రతిరోజు అధికారులతో పనిచేయించుకుంటున్నారు. టీడీపీ కౌన్సిలర్లకు మాత్రం మున్సిపల్ కార్యాలయంలో నాయకత్వం లేదు.

ఖాళీపోస్టులను భర్తీ చేయించుకోలేని దుస్థితి

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్ పోస్టు ఖాళీ ఉంది. టీడీపీ ప్రభుత్వం వచ్చి 11 నెలలు దాటుతున్నా అసిస్టెంట్ కమిషనర్‌ను వేయించుకోలేక పోతున్నారు. అలాగే కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ నడవడానికి కీలకమైన మున్సిపల్ మేనేజర్ పోస్టు ఇప్పటికీ ఖాళీ ఉంది. అభివృద్ధి పనులు సాగాలంటే ప్రధానమైన ఇంజనీరింగ్ సెక్షన్ హెడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు లేరు. కొద్దికాలం పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి వచ్చి ఆయన తిరిగి పదోన్నతిపై వెళ్లిపోయారు. దాదాపు 6నెలలుగా ఈఈ కూడా లేరు. ఈ పరిస్థితిలో మున్సిపాలిటీలో రూ.30 కోట్ల గ్రాంట్‌నిధులతో చేపట్టవలసిన అభివృద్ధి పనులతో పాటు రోడ్ల విస్తరణ, మార్కెట్ నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి.

అవగాహన కోసమే మాక్‌డ్రిల్ : డీఎస్పీ



విమానాశ్రయం వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవగాహన కోసమే మాక్‌డ్రిల్ నిర్వహించామని, దీనిని చూసి ఎవరూ భయపడవద్దని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. కడప విమానాశ్రయం, ఐవోసీలో బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. విపత్తు జరిగే సమయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఉగ్రవాదులు దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై మాక్‌డ్రిల్ నిర్వహించామని అన్నారు. పోలీసు సైరన్లు వచ్చినప్పుడు ప్రజలందరూ రోడ్లపై తిరగరాదన్నారు. ప్రజలు సోషల్ మీడియా, వాట్సప్‌లో వచ్చే మెసేజ్‌లను నమ్మి భయపడవద్దన్నారు. అనంతరం విమానాశ్రయంలో బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించడంతో పాటు ఏదైనా ప్రమాదం జరిగితే వారిని ఎలా రక్షించాలి అనే అంశాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. అలాగే ఐవోసీలో కూడా ఏదైనా విపత్తు జరిగినప్పుడు ఆపదలో ఉన్నవారిని ఎలా రక్షించి తీసుకెళ్లాలనే దానిపై మాక్‌డ్రిల్ నిర్వహించడంతో పాటు ఏదైనా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలు ఎలా ఆర్పాలి, ఆ సమయంలో ఎవరిని ఎలా రక్షించాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ పోలీసులు, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



కడప ఐవోసీ వద్ద మాక్‌డ్రిల్ చేస్తున్న పోలీసులు

గాలివాన బీభత్సం

● నేలకొరిగిన అరటి ● కల్లాల్లోనే తడిచిన వరి ధాన్యం ● రైతుల ఆశలు ఆవిరి

ఓబులవారిపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సానికి వందలాది ఎకరాల్లో పంటలు నాశనమై కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో 112 మంది రైతులకు సంబంధించి సుమారు 177 ఎకరాల్లో అరటి పంటకు నష్టం జరిగిందని హార్టికల్చర్ అధికారులు అంచనా వేశారు. ఇవే కాకుండా స్వల్ప మోతాదుల్లో దెబ్బతిన్న వాటిని లెక్కచేయకపోవడం వల్ల చాలా మంది రైతులు నష్టాలపాలయ్యారు. చిన్నఓరంపాడు, పెద్దఓరంపాడు, ముక్కావారిపల్లె, గాదెల, వై.కోట, బాలిరెడ్డిపల్లె, చిన్నంపల్లె వంటి గ్రామ పంచాయతీల్లో అరటి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక రైతు సుమారు 4 ఎకరాల సాగుకు ఐదు లక్షలకు పైబడే ఖర్చు చేసినట్లు తెలిపారు. అయితే పంట చేతికొచ్చే సమయానికి గాలివాన నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులకు గురైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ఓబులవారిపల్లె గ్రామ పంచాయతీలో పిడుగుపాటుకు ఓబిలి శ్రీనివాసులరెడ్డి ఇంటిలో విద్యుత్ సామగ్రితో పాటు గ్రామంలోని సుమారు 20 ఇళ్లల్లో ఫ్రిజ్‌లు, టీవీలు, కరెంటు పరికరాలు కాలిపోయాయని తెలిపారు.

ఒంటిమిట్టలో...

ఒంటిమిట్ట, మే 7 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో గాలివాన బీభత్సం సృష్టించింది. బుధవారం తెల్లవారుజామున 2.30 నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో అరటి రైతు కుదేలయ్యాడు. ఒంటిమిట్టలో ఉదయం 7 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఒంటిమిట్ట సమీపంలో రైతులు సుమారు 15 ఎకరాల్లో అరటిపంట సాగు చేశారు. చేతికొచ్చిన పంట ఈదురు గాలులతో కుప్పకూలిపోయింది. దీంతో రైతుల ఆశలు ఆవిరి అయిపోయాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికొచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ఎకరా అరటి పంట సాగు చేయాలంటే సుమారు లక్ష రూపాయలు ఖర్చు వస్తుందని, వాతావరణం అనుకూలించి పంట చేతికొస్తే ఎకరాకు 2 లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు. అలాంటిది అకాల వర్షం కారణంగా తమ పంట నేలకొరిగిపోవడంతో పెట్టుబడి రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. అప్పులు చేసి పంటను సాగు చేస్తే చేతికొచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరటి పంటకు నీటికొరత ఏర్పడడంతో నానా తంటాలు పడి నీరు అందించి పంటను సాగు చేస్తే విధి తమతో ఆడుకుందని ఆవేదన చెందారు. మండలంలోని భీమవరం వసుంధర అనే మహిళా రైతు ఆరు ఎకరాల్లో అరటి పంటను సాగు చేశారు. అలాగే నితీశ్వర్‌రెడ్డి అనే రైతు 5 ఎకరాల్లో అరటి పంటను సాగు చేశారు. వీరితో పాటు మరికొందరు రైతులు కూడా అరటి పంటను సాగు చేశారు. ఈదురు గాలులు వర్షంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అప్పుచేసి పంట సాగు చేశాం



చేతిలో డబ్బులు లేకపోయినా అప్పు చేసి అరటి పంటను సాగు చేశాం. చేతికొచ్చే సమయంలో పంట నేలకొరిగిపోవడంతో అప్పు తీర్చలేని పరిస్థితి ఏర్పడింది.

- భీమవరం వసుంధర, రైతు, ఒంటిమిట్ట

ప్రభుత్వం ఆదుకోవాలి



చేతికొచ్చిన పంట నేలపాలు కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలి. ఎంతో కష్టపడి ఐదెకరాల్లో పంటను సాగు చేశాను. అకాల వర్షంతో కోలుకోలేని దెబ్బ తగిలింది.

- నితీశ్వర్‌రెడ్డి, రైతు, ఒంటిమిట్ట



ఈదురుగాలులకు ఒంటిమిట్టలో నేలకొరిగిన అరటి తోట





సీవో కమ్మపల్లెలో దెబ్బతిన్న అరటి తోట వద్ద రైతు మాడపూరు సుబ్రమణ్యంనాయుడు, దెబ్బతిన్న అరటి తోటను చూపుతున్న రైతు వేమన రవీంద్రనాయుడు

కల్లాల్లోనే తడిచిన వరి ధాన్యం

చెన్నూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో అకాల వర్షంతో రైతులు అవస్థలు పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత కురిసిన వర్షం వరి కోత రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. రెండు రోజుల నుంచి వరి కోతలు చేపట్టిన రైతులు కల్లాల్లోనే ధాన్యం ఆరబెట్టుకోగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత కురిసిన భారీ వర్షంతో కల్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం మొత్తం తడిసిపోయింది. దీంతో ఆ రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రబీ సీజనులో వేసవిలో కోతకు వచ్చే విధంగా వరి సాగు చేపట్టిన రైతులు కాసింత ఆలస్యంగానే వరి సాగు చేపట్టారు. కాగా చాలా వరకు ఏప్రిల్ 15 నాటికి వరి కోతలు పూర్తయ్యాయి. అంతో ఇంతో మిగిలిన రైతులు గత వారం రోజులుగా వరి కోతలు చేపట్టారు. సోమ, మంగళవారాల్లో వరిని కోస్తున్న రైతులకు అనుకోకుండా వచ్చిన వర్షం పెద్ద దెబ్బతీసింది. మండలంలోని బుడ్డాయపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి, ఉమాదేవి, పరమేశ్వర్‌రెడ్డి, ఇలా మరికొంతమంది రైతుల ధాన్యం కల్లంలో తడవడంతో ఆరబెట్టి అమ్ముకోవాలన్నా ఇంట్లో వేసుకోవాలన్నా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు. పైగా ప్రభుత్వం కూడా ప్రస్తుతం ధాన్యాన్ని ముఖ్యంగా జిల్లా ప్రాంతంలో కొనుగోలు చేసేందుకు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందేమోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బుడ్డాయపల్లె వద్ద వరిపొలాల్లో తడిచిన ధాన్యం



రోడ్డుపై ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

పౌరుల బాధ్యతే ముఖ్యం

● ఏపీఎండీసీలో మాక్ డ్రిల్



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఓబులవారిపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): భారతదేశం- పాకిస్థాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంలో విపత్కర పరిస్థితుల్లో ప్రజలను రక్షించుకునేందుకు కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఏపీఎండీసీ మంగంపేటలో సంక్షోభం సమయంలో ప్రాణాలు ఎలా కాపాడుకోవాలి అన్న అంశాలపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా సీపీఆర్ అందించడం, గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించడం, అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఫైర్‌శాఖ వారిని సంప్రదించి ప్రమాదాల నుంచి రక్షణ పొందడం వంటి వాటిని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అలాగే పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌రావు, సీపీవో సుదర్శన్‌రెడ్డి, మైన్స్ మేనేజర్ గోపినాథ్, ఎస్ఐ మహేష్, ఎస్పీఎఫ్ ఎస్ఐ శివ, సిబ్బంది, కోడూరు ఫైర్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది త్రివేణి జీఎం, డిప్యూటీ మేనేజర్ చలపతిరెడ్డి, హెచ్‌ఆర్‌డీ నారాయణరెడ్డి, ఏపీఎండీసీ ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

పోక్సో కేసులో కర్ణాటక వాసి అరెస్టు

కలికిరి, మే 7 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసు నిందితుడు కర్ణాటక రాష్ట్రం హసన్ పట్టణానికి చెందిన జె.ఎస్.రాజేశ్ అలియాస్ సునీల్ (24)ను బుధవారం కలికిరి క్రాసు రోడ్డులో అరెస్టు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ రెడ్డిశేఖరరెడ్డి తెలిపారు.

కలికిరి పట్టణంలో బేకరీ నిర్వహిస్తున్న అతను హసన్ ప్రాంతానికే చెందిన ఓ బాలికను మోసగించడంతో ఆమె ఓ బిడ్డకు జన్మనిచ్చిందన్నారు. ఆ బాలిక ఫిర్యాదు మేరకు హసన్‌లో కేసు నమోదు కాగా, ఆ కేసు కలికిరికి బదిలీ అయ్యిందన్నారు. దీంతో తాము అతడిని బుధవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండు విధించారని సీఐ తెలిపారు.

రైతు ఫిర్యాదుతో జేసీ పర్యటన



రైతు షెడ్డును పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

సిద్దవటం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుమలోపల్లె రెవెన్యూ పొలం గ్రామానికి చెందిన రైతు శివకుమార్ ఫిర్యాదుతో కడప జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ బుధవారం కనుమలోపల్లె గ్రామంలో పర్యటించారు. నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా రైతు శివకుమార్ రేకుల షెడ్డు నిర్మాణానికి నష్టపరిహారం కింద డబ్బులు తక్కువ ఇచ్చారని జేసీకి ఫిర్యాదు చేయడంతో విచారణ నిమిత్తం ఆమె పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం కడప-చెన్నై జాతీయ రహదారి పక్కనున్న జేఎంజే కళాశాల వద్ద పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంతాలను పరిశీలించారు. మండలంలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్ ఇర్విన్, ఇన్‌చార్జి మండల తహసీల్దారు మాధవీలత, ఆర్‌అండ్‌బీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామి హుండీ లెక్కింపు

నందలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు సౌమ్యనాథస్వామి హుండీని బుధవారం లెక్కించగా రూ.2,64,921 వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీని నెలరోజుల తర్వాత లెక్కించామన్నారు. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన్, భక్తులు పాల్గొన్నారని తెలిపారు.



హుండీ డబ్బును లెక్కిస్తున్న దృశ్యం

ఇందిరమ్మ కాలనీలో బెల్టు షాపులు...!

మహిళల పట్ల మందుబాబుల అసభ్య ప్రవర్తన

గుర్రంకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ ఇందిరమ్మకాలనీలో బెల్టుషాపుల జోరుతో మద్యం వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలుగా సాగుతోంది. ఇందిరమ్మ కాలనీ, ఎన్టీఆర్ కాలనీలో సుమారు 700 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ కాలనీలో కొన్ని నెలలుగా మద్యం వ్యాపారం జోరుగా జరుగుతోంది. ఇందులో భాగంగా కాలనీలో ఆరు బెల్టు షాపులను అక్రమంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఈ బెల్టుషాపుల్లో వేలాది రూపాయల మద్యం వ్యాపారం చేస్తున్నారు. బెల్టుషాపు నిర్వాహకులు ఉదయం 6 గంటల నుంచే మద్యంను విక్రయిస్తున్నారు. దీంతో మద్యం కోసం మందుబాబులు తెల్లారకనే బెల్టు షాపుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం తాగి వీధుల్లో తూలుతూ ఎక్కడపడితే అక్కడ పడిపోతున్నారు. అంతేకాకుండా వీధుల్లో ఉండే మహిళలపై మందుబాబులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు మహిళలు వాపోతున్నారు. బెల్టుషాపుల నిర్వహణపై ఎక్సైజ్, పోలీసులకు తెలిపినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వాల్మీకీపురం ఎక్సైజ్ సీఐ లత వివరణ కోరగా ఇందిరమ్మ కాలనీలో బెల్టు షాపులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బెల్టుషాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

కురబలకోట, మే 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు... పెద్దమండ్యం మండలం శెట్టివారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు వెంకటరమణ (22) మండలంలోని అంగళ్లు సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు.

బుధవారం తన స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంలో కళాశాలకు వెళుతూ ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో కిందపడ్డాడు. అదే సమయంలో ఆ మార్గాన వెళుతున్న ట్రాక్టర్ అతడిపై దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ మరో విద్యార్థి శశిధర్ మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

నేను విజిలెన్స్ డీఎస్పీని..సస్పెండ్ చేస్తా జాగ్రత్త..!

● మీ అక్రమాలు చాలానే ఉన్నాయి..సర్దుకోండి
● ట్రాన్స్‌కో అధికారులకు అజ్ఞాత వ్యక్తి ఫోన్
● ఫోన్‌లో బెదిరింపు...రూ.లక్ష ట్రాన్స్‌ఫర్
● మోసపోయిన బాధితులు..ఫిర్యాదుకు ససేమిరా
● విజిలెన్స్, ఏసీబీ, సీఐడీ పేరుతో మోసాలు



మదనపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): మోసపోయే వాళ్లు ఉన్నంత వరకు మోసం చేసే వాళ్లు పుట్టుకొస్తూనే ఉంటారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ క్రైం నేరగాళ్లు కూడా పెరిగిపోతున్నారు. ఇందుకు ఫోన్లలో మెసేజ్ లింకులు, డైరెక్ట్‌గా ఫోన్‌కాల్స్, వీడియో కాల్స్ ఇలా...వివిధ రూపాల్లో విజిలెన్స్, ఏసీబీ, సీబీఐ అధికారులం అంటూ బ్లాక్‌మెయిల్, బెదిరింపులకు పాల్పడుతూ అటు ప్రజలు, ఇటు అధికారులను మోసం చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో అక్షరజ్ఞానం లేని సామాన్యుడి నుంచి నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉన్నతాధికారులు కూడా బలవుతున్నారు. కొందరు పోలీసులను ఆశ్రయిస్తుండగా మరికొందరేమో ఎటూ మోసపోయాం..నష్టపోయాం బయటకు తెలిస్తే పరువుపోతుందని బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు, ఉదంతాల నుంచి అప్రమత్తం చేసే క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాయి. చివరకు ఫోన్ డయిలింగ్‌లోనూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌ల నుంచి జాగ్రత్తగా ఉండాలని, అనుమానం వస్తే సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నెంబర్-1930 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. అయినా చాలామంది వీటిని పెడచెవిన పెడుతున్నారు. అజ్ఞాత వ్యక్తుల మాటలు విని, బెదిరింపులకు భయపడి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇందుకు నిదర్శనమే..జిల్లాలోని మదనపల్లె డివిజన్‌లో తాజాగా జరిగిన సంఘటనలివీ.

మదనపల్లె మండలం సీటీఎం ఏరియాలోని ఇద్దరు ట్రాన్స్‌కో అధికారులు అజ్ఞాత వ్యక్తుల చేతిలో తీవ్రంగా నష్టపోయారు. వారం రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ట్రాన్స్‌కోలోనే కాదు స్థానికంగా తీవ్రమైన చర్చ నడుస్తోంది. మదనపల్లె-తిరుపతి ప్రధాన రహదారి వెంట ఇటీవల రోడ్డు విస్తరణ పనులు, సీటీఎంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇక్కడ విద్యుత్తు శాఖ, జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో విద్యుత్తు స్తంభాలు, లైన్ల మార్పుతో పాటు కొత్తగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ముసుగులో సమీపంలోని రైతులు, ప్రైవేటు వ్యక్తుల భూములు, స్థలాల్లో ఉన్న వాటిని అనధికారికంగా మార్పు చేసినట్లు చెబుతున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో వివరాలు రాబట్టిన అజ్ఞాత వ్యక్తి తాను విజిలెన్స్ డీఎస్పీని అంటూ ట్రాన్స్‌కో అధికారికి ఫోన్ చేసి బెదిరించాడు. విద్యుత్తు పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారని, తన వద్ద ఆధారాలు ఉన్నాయని..ఒకటి, రెండు అంశాలను ఫోన్‌లో వివరించినట్లు తెలిసింది. మీపై చర్యలు తీసుకుంటామని, సస్పెండ్ చేస్తామని బెదరింపు ధోరణితో హెచ్చరించినట్లు సమాచారం. దీంతో బయపడిన ఆ అధికారి వెంటనే తన కిందస్థాయి అధికారిని లైన్‌లోకి తీసుకుని మాట్లాడమని చెప్పారు. ఆ అజ్ఞాత వ్యక్తి ఇదే స్థాయిలో వివరాలు చెప్పి బెదిరించడంతో ఆయన కూడా కాస్త మెత్తబడ్డారు. సార్ అలా చేయొద్దని, తాను మీతో మాట్లాడుతానని చెప్పడంతో ఫోన్‌పేలో డబ్బులు వేయమని లైన్‌లో ఫోన్‌లో మాట్లాడుతుండగానే, మరో నెంబరు ఇచ్చి డబ్బులు వేయమన్నాడు. అంతే ట్రాన్స్‌కో కిందిస్థాయి అధికారి వెంటనే లక్ష రూపాయలు అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన ఫోన్ నెంబర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత సీన్ కట్ చేస్తే..అతనెవరో తెలీదు. ఫోన్ నెంబర్లు పనిచేయడం లేదు. చివరకు మోసపోయామని తెలుసుకున్న ఇద్దరు ట్రాన్స్‌కో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో ఉన్నతాధికారి దృష్టికి తెస్తే..విషయం బహిర్గతం కాకుండా, చేయకుండా సర్దుబాటు చేశారు. మోసపోయామని తెలుసుకున్న వారిద్దరూ..పోయిన డబ్బుల కోసం పంచాయితీ పెట్టారు. నాపై అధికారి చెబితే సమస్య లేకుండా మ్యానేజ్ చేశానని బాధితుడు..కాదు మాట్లాడమని మాత్రమే తాను చెప్పానని, ఒకేసారి డబ్బులు చెల్లించమని చెప్పలేదని ఆ అధికారి వాదించుకుంటున్నారు. ఈ విషయం సహచరుల దృష్టికెళ్లగా, ఫోన్ నెంబర్ల ఆధారంగా ఫిర్యాదు చేద్దామంటే వద్దంటున్నారు. ఇద్దరు బాధితుల్లో ఒకరు వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు, కేసులు ఎందుకని, ఇన్నాళ్ల సర్వీసులో ఎప్పుడూ ఇలాంటి సంఘటన జరగలేదని, ప్రశాంతంగా ఇంటికెళ్లిపోతే పోతుందులే అన్నట్లు ఉండిపోయారు.

● నేను ఏసీబీ అధికారి కసిరెడ్డిని మాట్లాడుతున్నా..నీపై దగ్గర్లోనే రైడ్ చేస్తున్నాం..అరెస్టు చేస్తున్నానమంటూ గత ఏడాది నవంబరు 7వ తేదీ మదనపల్లెలోని ట్రాన్స్‌కో అధికారి ఫోన్ చేశాడు. నిన్ను లోపల వేశాకే తెలుస్తుంది..అరెస్టు చేశాక నీకు అర్థమవుతుంది..మా వాళ్లంతా బయలుదేరుతున్నారు.. హైదరాబాద్ నుంచి అంటూ వీడియో కాల్‌లో కార్యాలయాన్ని చూపించాడు. ఏదో చూడంటి సార్..అంతా మీ చేతుల్లోనే ఉంది.. మీరే కాపాడాలని ఆయన అతడిని ఫోన్‌లో వేడుకున్నాడు. ఫోన్‌లైన్‌లో మాట్లాడుతూనే, అంతలో ఫోన్‌పే నెంబరు ఇచ్చి డబ్బులు వేయమని సూచించాడు. ఆ నెంబరు తీసుకుని సర్, మీరెక్కడున్నారు.. నేను పర్సనల్‌గా మీతో మాట్లాడాలని బాధితుడు చెప్పాడు. ఇది హైదరాబాద్ అని చెప్పడంతో బాధితునికి కాస్త ధైర్యం వచ్చి..తిరిగి అతడితో మాట్లాడారు. మీరు ఇందాక వీడియోకాల్‌లో చూపించిన కార్యాలయం ఎక్కడ సార్ అని ఆరా తీయగా, ఇది హైదరాబాద్ ఏసీబీ కార్యాలయం అని సమాధానం రావడంతో బాధితుడు మరింత ధైర్యం తెచ్చుకుని ఎదురుతిరిగాడు. నేను ఉద్యోగం చేస్తున్నది ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా తిరుపతి సర్కిల్‌లో తెలంగాణాకు, ఏపీకి సంబంధం ఏంటని బాధితుడు ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇతను కూడా బెదిరింపు ధోరణితో మాట్లాడటంతో కాల్ కట్ చేసేశాడు. భయపడకుండా ధైర్యంగా ప్రశ్నించడంతో ఆయన మోసం నుంచి తప్పించుకున్నాడు.

● బి.కొత్తకోటకు చెందిన మరో ట్రాన్స్‌కో అధికారికి ఈ ఏడాది జనవరిలో విజిలెన్స్ ఎస్పీని అంటూ ఫోన్ వచ్చింది. వెంటనే నీవు నాకు లక్ష రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేయాలని లేకుంటే వెంటనే సస్పెండ్ చేస్తానని బెదిరించాడు. దీంతో భయపడిపోయిన ఆయన రెండురోజులు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. దీంతో అజ్ఞాత వ్యక్తి మోసం నుంచి బయటపడ్డాడు. తీరా చూస్తే..తర్వాత అలాంటిదేమీ జరగకపోవడంతో మోసం నుంచి గట్టెక్కానని బాధితుడు ఊపిరి పీల్చుకున్నాడు. ఇలా వరుసగా విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బందికే బెదిరింపు కాల్స్ రావడంపై ఆ శాఖాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వివాదాస్పద నిర్మాణాలపై

ఏఎస్పీ విచారణ



నిర్మాణాలపై విచారణ చేస్తున్న ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే

రాజంపేటటౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం డీబీఎన్‌పల్లె అరుంధతివాడ చుట్టూ కొందరు ఏర్పాటు చేసుకున్న గోడ నిర్మాణాలను బుధవారం ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే పరిశీలించి విచారణ చేశారు. ఈ నిర్మాణాలపై కొందరు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ చేపట్టారు. ఎగువ అరుంధతివాడ, దిగువ అరుంధతివాడ ప్రజలతో మాట్లాడారు.

అగ్రవర్ణాల వారు వివక్షతో తమ గ్రామం చుట్టూ ఎత్తయిన గోడలు నిర్మించి తమను సామాజిక బహిష్కరణకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అంటరానితనంతో కుల వివక్షతతో తమ గ్రామం చుట్టూ ఎత్తయిన గోడలు నిర్మించడం దారుణమన్నారు. వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన పూర్వాపరాలను ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని వారికి ఏఎస్పీ హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ఓబులవారిపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి మంగంపేట పరిసరాల్లో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని పలువురికి గాయాలయ్యాయని ఎస్ఐ మహేష్ తెలిపారు. రైల్వేకోడూరు నుంచి రాజంపేట వైపు వెళుతున్న స్కార్పియో వాహనం, ఓబులవారిపల్లె నుంచి రైల్వేకోడూరుకు వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇరువాహనాల డ్రైవర్లు సుభాన్, అజయ్ కాగా మరొక వ్యక్తికి గాయాలు కావడంతో 108 ద్వారా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెన్నా తీరంలో... ప్రమాద ఘంటికలు



- కరకట్టలు లేకపోతే...వరదనీటితో ముప్పు
- ఏటా కోతకు గురవుతున్న నదీ తీరం
- ఆందోళనలో పరివాహక గ్రామాల ప్రజలు

పెన్నాతీర ప్రాంతం ఏటా కోతకు గురవుతోంది. 50 ఏళ్ల నాడు నిర్మించిన కరకట్టలు దాదాపు దెబ్బతినడంతో వరద నీరు వచ్చినప్పుడల్లా నీటి ఉధృతికి పెన్నా తీరం క్రమేపీ కోతకు గురవుతోంది. వర్షాకాలంలో నదిలో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు నదీ పరివాహక గ్రామాల ప్రజలు ఎప్పు డు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.
వెంటనే నదికి ఇరువైపులా రాతి కరకట్టలు నిర్మించి ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా కాపాడాలని పరివాహక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెన్నూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మండలంలోని పెన్నాతీరం ప్రాంతంలో గల గ్రామాలన్నింటికీ ఆదే పరిస్థితి ఉంది. ప్రతి ఏటా వర్షాకాలంలో కుందూ, పాపాఘ్ని నదుల నుంచి వరద నీరు వచ్చి పెన్నానదిలో కలిస్తే నీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దాదాపు 25 అడుగుల మేర.. లక్ష క్యూసెక్కుల పైన వరద నీరు పెన్నానది నుంచి ప్రవహిస్తూ సోమశిల వైపు దూసుకెళుతుంది. ఇలా దాదాపు 70, 80 ఏళ్లుగా వరదనీరు ప్రవహిస్తుండడంతో పెన్నా తీరమంతా క్రమేపీ కోతకు గురైంది. గతంలో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా... తీరం వెంబడి రాతికట్టడం కట్టాలన్నా, కరకట్టలు నిర్మించాలని కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుందని.. నీటి పారుదల, పంచా యతీ రాజ్‌శాఖ అధికారులు చేతులెత్తేశారు.

50 ఏళ్ల క్రితం కట్టిన కరకట్టలే

పెన్నానదిలో ప్రవహించే వరద నీటి ఉధృతికి తీరం కోతకు గురికాకుండా.. 1975 ప్రాంతంలో చెన్నూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ పీటీ వీరా రెడ్డి రాష్ట్రస్థాయి అధికారులను ఒప్పించి నది లో తొమ్మిది చోట్ల కరకట్టలు ఏర్పాటు చేశారు. కొక్కిరాయపల్లె నుంచి చెన్నూరు గ్రామ పంచా యతీ చివరి వరకు నదిలోకి సుమారు 10 నుంచి 12 అడుగుల మేర కరకట్టలు నిర్మించారు. దీంతో నదిలో నీరు ఎంత ఉధృతంగా ప్రవహించినా నీరు తీరం వైపు రాకుండా నదిలో ప్రవహించేది. పాతికేళ్ల వరకు ఇబ్బంది లేకుండా ఉండేది. ఏటా వరద నీటి ఉధృతికి కరకట్టలు క్రమేపీ దెబ్బతింటూ వచ్చాయి. దీంతో వరద నీరు ఎక్కువగా వచ్చినప్పుడు కరకట్టలపై పొంగి ప్రవహిస్తూ తీర ప్రాంతం కోతకు గురై.. వరద నీటిలో వచ్చే విషసర్పాలు తీర ప్రాంత ఇళ్లల్లోకి వస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి నదీ తీరం వెంబడి దెబ్బతిన్న కరక ట్టలను పునఃనిర్మించాలని పరివాహక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గతంలో రూ.10లక్షలు మాత్రమే నిధులు మంజూరు

పెన్నాతీరం కోతకు గురవుతుందని 23 ఏళ్ల క్రితం అప్పటి ఉప మండలాధ్యక్షురాలు ఈ విషయాన్ని అప్పట్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. రూ.10 లక్షలు మాత్రం మంజూరు చేశారు. దీంతో చెన్నూరు కొండపేట వంతెన మొదట్లో మైనార్టీ కాలనీ వైపు ఏటి వెంబడి కొంత వరకు గోడ నిర్మించారు. ఆ తరువాత ఒక్కపైసా కూడా నిధులు మంజూరు కాలేదు. దాదాపు 30 ఏళ్లుగా ప్రజలు పెన్నాతీరం కోతకు గురవుతుందని నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

వానా కాలం వస్తే భయమేస్తుంది



వానాకాలం వస్తే.. వరద నీటి ఉధృతి చూస్తే భయం వేస్తుంది. నదిలో నీళ్లు ఊరిపైకి వస్తాయేనోనని టెన్షన్‌గా ఉంటుం ది. ఏటికి ఇరువైపులా మట్టికట్ట అంతా కోసుకుపోయింది. దీంతో ఏటిలో పూడ్చేం దుకు శవాలు తీసుకెళ్లాలన్నా దారి లేకుండా పోయింది. అంతకు ముందు పోయే దారి వరద నీటి ఉధృతికి కోతకు గురైంది. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి రాతికట్టలు కట్టాలి.

- కుందేటి క్రిష్ణయ్య, వనంవీధి, చెన్నూరు

నదికి రెండు వైపులా రాతి కట్టలు కట్టాలి



రెండేళ్లక్రితం పెన్నానదికి ఉధృతంగా ప్రవహించడంతో చెన్నూరు వైపు ఇళ్లలోకి నీళ్లు వచ్చాయి. కొండపేట వైపు చాలా వరకు కోతకు గురైంది. వరద నీటి ఉధృతి తట్టుకోవాలంటే నదికి ఇరు వైపులా మట్టి కోతకు గురికా కుండా రాతికట్టలు కట్టాలి. 25 ఏళ్ల క్రితం కొద్దిగా నిధులు వచ్చాయి. ఇళ్లు, భూములు వరద నీటితో దెబ్బతిన కుండా కరకట్టలు నిర్మించాలి.

- ఎం.మోహన్‌రెడ్డి,. మాజీ సర్పంచ్, కొండపేట

ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త... ప్రభుత్వ ధ్యేయం



కొప్పర్తిలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తదితరులు

సీకేదిన్నె, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. అందులో భాగంగా కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎంఎస్‌ఎంఈ ప్రాజెక్టు ద్వారా పరిశ్రమలను స్థాపించడానికి బుధవారం శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికంగా అభివృద్ధి చెంది వారు ఉపాధి పొందడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెట్టలేని వారి కోసం చిన్న చిన్న వ్యాపారాలను ప్రోత్సహించేందుకు కూడా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఇతర రాష్ట్రాలకు పోయి వ్యాపారాలు పెట్టే బదులు స్థానికంగా ఉండే అవకాశాలను ఉపయోగించుకుని పరిశ్రమలు పెడితే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. కొప్పర్తిని ప్రజా ఇండ్రస్ట్రియల్‌పార్కు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇప్పటికే కొన్ని పరిశ్రమలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొప్పర్తిలో రైల్వేలు, రోడ్డుమార్గం, విమాన మార్గాలు అందుబాటులో ఉండడంతోపాటు నీటి సౌకర్యం కూడా పుష్కలంగా ఉందని, ఈ అవకాశాలను యువపారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోగటం సుజాత, నేతలు కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, జనార్ధన్‌రెడ్డి, శ్రీను, ఓబుళరెడ్డి, మహేష్, నజీర్, వీరకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్వహణకు నిధులు మంజూరు చేయాలి

- వెలగచర్ల గ్రామస్థుల వినతి



వెలగచర్ల గ్రామస్థులు నిర్మించుకున్న రామాలయం

పెనగలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలం వెలగచర్ల గ్రామంలో గ్రామస్థులు నూతనంగా శ్రీరామ ఆలయాన్ని నిర్మించుకున్నారు. అందరూ చందాలు పోగు చేసి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆలయాన్ని నిర్మించారు. అయితే ధూప దీప నైవేద్యం ఆలనాపాలన చూసుకోవడానికి తమకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ ఆలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని దేవదాయశాఖకు అప్పగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆలయంలో దూపదీప నైవేద్యపు ఆలనాపాలన ఖర్చులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈమేరకు దేవదాయ ధర్మాదాయ శాఖకు గ్రామస్థులు విన్నవించారు.

ధూప దీప నైవేద్య ఖర్చులు ఇవ్వండి



గ్రామంలో సుమారు 100 కుటుంబాలు పైబడి ఉన్నాయి. అందరం చందాలు పోగు చేసి ఇటీవల నూతనంగా రామాలయం నిర్మించుకున్నాం. ఈ ఆలయాన్ని దేవదాయశాఖలో విలీనం చేసుకుని ధూప దీప నైవేద్య ఖర్చులు ఇవ్వాలి.

-అబ్బిగారి వెంగయ్య, వెలగచర్ల గ్రామం,

దేవదాయశాఖలో విలీనం చేసుకోవాలి



దేవదాయ ధర్మాదాయశాఖ తమ ఆలయాన్ని వెంటనే విలీనం చేసుకోవాలి. ప్రభుత్వం తరపున ధూప దీప నైవేద్యానికి అందజేసే నెలసరి పారితోషకం మంజూరు చేయాలి.

-ఏనుగుల శంకరయ్య,
విశ్రాంత ప్రధానోపాధ్యాయులు

ఆర్టీపీపీ సీఈగా వాసుదేవరావు

ఎర్రగుంట్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎంవీఆర్‌ఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌గా జి.వాసుదేవరావు నియమితులయ్యారు. ఆయన లోయర్ సీలేరు హైడల్ పవర్ స్టేషన్ చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. అలాగే ఇక్కడ చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న గౌరీపతి విద్యుత్ సౌదలో చీఫ్ జనరల్ మేనేజర్ అడ్మినిస్ట్రేషన్‌గా బదిలీపై వెళుతున్నారు. ఆయన బుధవారం రాత్రే ఆర్టీపీపీ నుంచి రిలీవ్ అయ్యి గురువారం విద్యుత్ సౌదలో రిపోర్టు చేయనున్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతి చెందిన ధర్మారావు (ఫైల్)

లింగాల, మే 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పార్నపల్లెకు చెందిన పాముల ధర్మారావు (25) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఎస్‌ఐ మధుసూదన్‌రావు కథనం మేరకు వివరాలిలా.. ధర్మారావు తన తండ్రి ఎరికలప్పతో కలిసి మంగళవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లారు. వరిపంట కోత కోయించారు. పశువులు పొలంలోకి వస్తాయని భావించి ఎరికలప్ప కుమారునితో విద్యుత్ వెర్లను తీసివేసి ఇంటికి రమ్మని వెళ్లిపోయాడు. రాత్రి అయినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి పొలంలోకి వెళ్లి చూడగా.. విద్యుదాఘాతంతో స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఆటో, టిప్పర్ ఢీ... నలుగురికి గాయాలు

ఎర్రగుంట్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జువారి సిమెంట్ కర్మాగారం సమీపంలో బుధవారం తెల్లవారు జమున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వీరపునాయునిపల్లె మండలంలోని కీర్తిపల్లెకు చెందిన వారు ప్రొద్దుటూరుకు కూరగాయలు తెచ్చేందుకు ఆటోలో వెళుతున్నారు. జువారి సిమెంట్ కర్మాగారం సమీపంలో వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొంది. దీంతో ఆటోలో ఉన్న వెంకటరామిరెడ్డి, అంకిరెడ్డి తదితరులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని 108లో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. ఎర్రగుంట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హుల జాబితా సిద్ధం చేయండి : ఆర్డీవో



జెడ్‌హెచ్‌డీసీ భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

పోరుమామిళ్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): అసైన్‌మెంటు కమిటీలో భూములను పేదలకు పంచేందుకు అర్హుల జాబితాను సిద్ధం చేయాలని ఆర్డీవో చంద్రమోహన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని చల్లగిరిగెల పంచాయతీలో జెడ్‌హెచ్‌డీసీ భూములను అర్హులైన పేదలకు పంచేందుకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. అనంతరం ఎల్లోపల్లె సమీపంలో ఉన్న జెడ్‌హెచ్‌సీ భూములను పరిశీలించారు. సర్వే నెంబర్లు 4, 10, 11, 12, 13, 14, 15, 322 నుంచి 343 వరకు గల 351.61 ఎకరాల సంబంధించిన భూముల రికార్డులు పరిశీలించి భూములను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, వీఆర్వోలతో మాట్లాడుతూ భూములకు సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించి అర్హుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండా రామక్రిష్ణారెడ్డి, ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమత్ జయంతి ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం

చక్రాయపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 19 నుంచి 22 వరకు జరగనున్న హనుమత్‌జయంతి ఉత్సవాలకు దేవాదాయ ధర్మదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డిని ఆహ్వానించారు. బుధవారం నెల్లూరు లోని మంత్రి స్వగృహంలో గండి ఈఓ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామిలు ఆహ్వానించారు. అనంతరం హనుమత్ జయంతి కరపత్రాలను మంత్రి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ గండికి వస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గండి క్షేత్రంలో జరిగే అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు.

తెల్లరేషన్ కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పౌరులకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో బుధవారం నుంచి జిల్లాలో గ్రామ, వార్డు, సచివాలయాల్లో కొత్త బియ్యం కార్డులు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఏడు రకాల సేవలను ప్రారంభించినట్లు జేసీ అదితిసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త బియ్యం కార్డులు, బియ్యం కార్డులో కొత్త సభ్యుల పేర్లు చేరిక, తొలగించుట, అవసరం లేని కార్డులను సరెండర్ చేయుట, చిరునామాలు మార్చుట, తప్పుడు ఆధార్‌కార్డు సీడింగ్ జరిగి ఉంటే సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ సేవలు గతంలో ఆమోదించిన ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే ఉన్న ధ్రువీకరణలను, ఇతర డేటా బేస్‌లు కలుపుకొని క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల సమన్వయంతో అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని తెల్లకార్డు దారులందరూ సద్వినియోగం చేసుకోవాలని జేసీ ఆప్రకటనలో పేర్కొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన బ్రహ్మంగారిమఠం



దీక్షా అలంకరణ గుడి ఉత్సవంలో బ్రహ్మంగారు



బ్రహ్మంగారి దర్శనం కోసం క్యూలైనులో వేచి ఉన్న భక్తులు

బ్రహ్మంగారిమఠం, మే 7 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాల సందర్భంగా నాలుగోరోజు స్వామి సజీవసమాధి వహించిన పవిత్ర దినం కావడంతో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుండే భక్తులు క్యూలైనులో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 5 గంటలకు వీరబ్రహ్మ సుప్రభాతం, నామసంకీర్తనం, 8గంటలకు అభిషేకం, సహస్రనామార్చన, మధ్యాహ్నం 12 గంటలకు దీక్ష బంధనాలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులు ఇరగంరెడ్డి నాగిరెడ్డి, వెంకటరమణ, ప్రొద్దుటూరు వాస్తవ్యులు గుడి ఉత్సవం చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాం గణంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు, భోజనవసతి ఆలయ ఫిట్ పర్సన్ శంకరబాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సాయంత్రం 6గం టలకు కంది మల్లయపుర సంస్థాన ఆస్థాన విద్వాంసులు పెద్దపాటి నాగేశ్వర్‌రావు ఉప న్యాసం చేశారు. రాత్రి 8గంటలకు సప్తభారతి భగవతారిణిచే హరి కథా కాలక్షేపం చేశారు. ఆస్థాన పండితులు ఇడమకంటి జనార్ధనచార్యు లు, పోలూరి బాలబ్రహ్మం ఆచార్యులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు బ్రహ్మంగారి కాలజ్ఞానం, జీవిత చరిత్ర గురించి ఉపన్యాసం ఇచ్చారు. రాత్రి 11గంటలకు నరనంది ఉత్సవంపై వీరబ్రహ్మేంద్ర స్వామి సమేత గోవిందమాంబ భక్తులకు దర్శనమిచ్చారు. వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామానికి చెందిన తాడిగొట్ల వీరారెడ్డి, నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా చేరారు. కాగా, ఆరాధన గురుపూజ మహోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం 4 గంటల నుంచి వీరబ్ర హ్మేంద్రస్వామి దేవస్థానం మాడ వీధుల గుండా బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహిస్తారు.

వీరగురుడి కీర్తి అజరామరం

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చెల్లప్ప



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్.చెల్లప్ప

కడప ఎడ్యుకేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని పేదలు, బడుగు బలహీనవర్గాల వారి అభ్యున్నతికి తన జీవితాన్ని ధారబోసి కృషిచేసిన స్వర్గీయ టి.వీరగురుడి కృషి అజరామరమని ఆంధ్రప్రదేశ్ అదనపు ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఏఐఏస్ అధికారి ఎస్.చెల్లప్ప అన్నారు. బుధవారం కడపలో జరిగిన వీరగురుడు విగ్రహ ఆవిష్కరణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు భూపేష్‌రెడ్డి, ప్రముఖ లాయర్ సంపత్‌కుమార్, ఎస్టీయూ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేష్‌బాబు, సభాధ్యక్షుడు గోపాల్, జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు విశ్వనాథ, టి. బాలనాయుడు, పి.రమణారెడ్డి, ఎంఎండీ ఇలియాస్ బాష, పి.ఆంజనేయులు,పి.హనుమంతు,టి.సురేంద్ర, పి.శివారెడ్డి తదతరులు పాల్గొని ప్రసంగించారు.

బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించిన డాక్టర్ చెల్లప్ప

కడప మారుతీనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ చెల్లప్ప బుధవారం సందర్శించారు. పరిశోధన కేంద్రంలోని తాళపత్ర గ్రంథాలను, తామ్రపత్రాన్ని, చేతితో తయారు చేసిన కాగితాలను, బ్రౌన్ రచనలను, మెకంజీ కైఫీయత్తులను చూసి డాక్టర్ చెల్లప్ప హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీ బ్రౌన్ భాష పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సహాయ పరిశోధకుడు డాక్టర్ భూతపురి గోపాల క్రిష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకుడు రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంటు ఆర్.వెంకటరమణ, రిటైర్డ్ తహసీల్దార్లు హుస్సేన్, బాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు ఓల్డ్ పింఛన్ స్కీం అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు ఓల్డ్ పింఛన్ స్కీం అమలు చేయాలని 2003 డీఎస్సీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో డీఎస్సీ - 2003 ఉపాధ్యాయుల సమావేశం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు ఫోరం జిల్లా అధ్యక్షుడు గుజ్జల తిరుపాల్ అధ్యక్షతన నిర్వహించారు. తిరుపాల్ ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం 2003 ఉద్యోగ ఉపాధ్యాయులకు ఓల్డ్ పింఛన్ స్కీంను అమలు చేయడానికి అన్ని సంఘాలు తమ మద్దతును సంపూర్ణంగా అందజేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కావేటి ఉదయ భాస్కర్, పీఆర్‌టీయూ, ఎస్టీయూ, యూటీఎఫ్, ఆపస్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరై తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ 2003 ఫోరం జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివేకానంద పాఠశాల రికార్డులను బాలికల పాఠశాల హెచ్‌ఎంకు అందించాలి

కమలాపురం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వామి వివేకానంద ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన 1 నుంచి 10 తరగతుల రికార్డులన్నింటినీ స్థానిక బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతికి అందించాలని జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి ఆదేశాలు అందాయని ఎంఈవో సుభాషిణి అన్నారు. బుధవారం ఆమె స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల లీక్ వ్యవహారంతో ఆ పాఠశాల గుర్తింపును జిల్లా విద్యాశాఖ అధికారులు రద్దు చేయడం జరిగిందన్నారు.కావున తల్లిదండ్రులు టీసీలు తీసుకుని మీ పరిసర ప్రాంతాల్లని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అడ్మిషన్లు చేసుకోవాలని కోరారు. ఏవైనా సందేహాలుంటే ఉప విద్యాశాఖాధికారి సెల్ 9440702470 లేదా మండల ఎంఈవో -1 9959151551, బాలికలపాఠశాల హెచ్‌ఎం 7989112846 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

విప్లవజ్యోతి అల్లూరి : తులసిరెడ్డి



నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలు గర్వించదగ్గ విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి కొనియాడారు. అల్లూరి వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు వేంపల్లెలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం,రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, రమణ,వినయ్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకవి రవీంద్రుడుకి నివాళి: రవీంద్రనాథ్ ఠాగూర్ విశ్వకవీంద్రుడు, సాహితీ సార్వభౌముడు, కళామతల్లి ముద్దుబిడ్డ అని తులసిరెడ్డి శ్లాఘించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని వేంపల్లెలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.

వేంపల్లెలో ఆధార్ కేంద్రం లేక ఇబ్బందులు

వేంపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఆధార్ కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. సంక్షేమ పథకాలు అందాలంటే ఆధార్ తప్పనిసరిగా ఉందని, చిన్నచిన్న తప్పులు సరిదద్దుకోవాలంటే ఆధార్ కేంద్రం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలోను ఎంపీడీఓకు వినతిపత్రం ఇచ్చామని, అయినప్పటికీ ఆధార్‌కేంద్రం పూర్తిస్థాయిలో ఏర్పాటుచేయలేదని, జిల్లా అధికారులు స్పందంచి వెంటనే ఏర్పాటుచేయాలని కోరారు.

అధ్వానం....ఇడుపులపాయ రోడ్డు..!

రోడ్డంతా కంకర తేలడంతో గ్రామస్థుల అవస్థలు



ఇడుపులపాయకు వెళ్లే మార్గంలో కంకరతేలిన రోడ్డు

వేంపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): ఈ ఫోటోలో కనిపిస్తున్న గ్రామం పేరు ఇడుపులపాయ. ఈ గ్రామానికి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఆ పంచాయతీ పరిధిలో తరచూ ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు వచ్చి వెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యాక ఆ పంచాయతీలో ట్రిపుల్‌ఐటీని నెలకొల్పారు. ఆయన సొంతంగా గెస్ట్‌హౌస్‌లు నిర్మించుకున్నారు. అంతకుముందే ఆయన తండ్రి రాజారెడ్డి ఈ ప్రాంతానికి వచ్చి ఇక్కడ వ్యవసాయక్షేత్రం ఏర్పాటుచేసుకున్నారు. అప్పటి నుంచి ఆ కుటుంబ సభ్యులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్ ఇడుపులపాయకు వచ్చి వెళ్తుంటారు. వైఎస్ సీఎం అయ్యాక ఇడుపులపాయ గ్రామ పంచాయతీ పేరును ఆర్కేవ్యాలీగా మార్చారు. కానీ ఆ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు దెబ్బతిని ఉంది. గ్రామం వరకు దారి అంతా కంకరతేలి ఉంది. కాగా ఇడుపులపాయరోడ్డు దారుణంగా దెబ్బతిని ఉంది.

రోడ్డంతా కంకర తేలడంతో గ్రామస్థుల అవస్థలు..:
వేంపల్లె మండలంలో ఇడుపులపాయ ప్రస్తుతం ఆర్కేవ్యాలీ పేరుతో పిలువబడే గ్రామమిది. ఆ గ్రామానికి వెళ్లాలంటే వీరన్నగట్టుపల్లె, గండి జంక్షన్ నుంచి శేషాచల కొండవైపు వెళ్లాలి. సుమారు కిలో మీటర్ దూరంలో ఉంటుంది. ఆ రోడ్డు మధ్యలోనే వైసీపీ ప్రభుత్వం నిర్మించిన సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసాకేంద్రాలు ఉన్నాయి. ఆ రోడ్డు ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన కంకర తేలి ఉంది. గ్రామానికి వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాల్లో వెళ్లే సమయంలో పలుమార్లు ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నా యి. ఈ రోడ్డు మరమ్మతు చేయడమా లేదా కొత్తరోడ్డు వేయడంపై అధికారులు, ప్రజాప్రతి నిధులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

పట్టించుకోని వైసీపీ....కూటమి అయిన చేస్తుందా: మొన్నటి వరకు వైసీపీ పాలనలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉన్నారు. కానీ ఆ రోడ్డును వేయాలని గాని, మరమ్మతు చేయించాలని గాని ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ ప్రభుత్వంలోని అధికారులు, నాయకులైన స్పందించి ఇడుపులపాయ గ్రామానికి వెళ్లే మార్గంలో దెబ్బతిన్న రోడ్డు స్థానంలో కొత్తరోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డుతో అవస్థలు



ఇడుపులపాయ రోడ్డు పూర్తిగా దెబ్బతిని ఉంది. గతంలో కాంగ్రెస్ హయాంలో రోడ్డు వేశారు. ద్విచక్రవాహనంలో వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. కూటమి ప్రభుత్వం రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలి.

జయచంద్రుడు, ఇడుపులపాయ గ్రామం, వేంపల్లె.

చెర్లోపల్లె లేఅవుట్ సమస్యలు పరిష్కరించండి

కడప సెవెన్ రోడ్స్, మే 7 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని చెర్లోపల్లె లేఅవుట్ పరిధిలో నివాసముంటున్న ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని అధికార యంత్రాంగాన్ని సీపీఎం కడపనగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. బుధవార నాడు కడప నగరంలోని చెర్లోపల్లె లేఅవుట్ లో సీపీఎం ప్రతినిధి బృందం పర్యటన నిర్వహించారు. కాగా సమస్యల పరిష్కారానికి ఈనెల 12న ఉదయం 10గంటలకు కడప నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట స్థానికులతో కలిసి ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఈ-పోస్ మిషన్‌తోనే ఎరువులు విక్రయించాలి



మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఈ పోస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని కమలాపురం మండల వ్యవసాయ సంచాలకుడు ఏవీ నరసింహారెడ్డి సూచించారు. బుధవారం వ్యవసాయ డివిజను కార్యాలయంలో కమలాపురం, ఎర్రగుంట్ల, వీరపునాయునిపల్లె, వల్లూరు మండలాల ఎరువుల డీలర్లకు బుధవారం ఈపాస్ మిషన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఏవీ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ పాస్ మిషన్‌లు గతంలోఎ1.0-వెర్షన్‌తో పనిచేస్తుండేవన్నారు. ఇప్పుడు కొత్తగా ఎల్.1 వర్షన్‌తో ఈపాస్ మిషన్లు పనిచేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ జోనల్ ఆఫీసరు మణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం, వ్యవసాయ అధికారి గోవర్ధన, మండల వ్యవసాయాధికారి ఎం.సరస్వతి, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సేల్స్ మేనేజరు శివారెడ్డి, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

లింగాల, మే7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో రామకృష్ణయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వారు సంవత్సర ఆదాయం రూ.1.20లక్షల లోపు, పట్టణ ప్రాంతాలలో ఉన్న వారికిరూ.1.44లక్షల లోపు ఆదాయం ఉన్నవారు అర్హులన్నారు. ఐదేళ్లు నిండిన వారు 1వ తరగతిలో ప్రవేశాలకై దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు



కడప కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య ఇలవేల్పు వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారి జయంతి సందర్భంగా కడప నగరంలోని అమ్మవారిశాలలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి విశేష అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. 108 మంది సుహాసినీల స్వహస్తాలతో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యంకల్పించారు.

శానిటేషన్ పనులను పరిశీలించిన డీపీవో

పెండ్లిమర్రి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరుగుతున్న శానిటేషన్ పనులను బుధవారం డివిజనల్ పంచాయతీ అధికారి విజయభాస్కర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను తడి,పొడి చెత్తలను వేర్వేరుగా నింపాలన్నారు.ఆ సేకరించిన చెత్తనుండే సంపద సృష్టించాలని దాని ద్వారానే పంచాయతీకి ఆదాయంతో పాటు గ్రామాలు శుభ్రంగా ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాఘవరెడ్డి పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి హరిత రాయబారులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

కడప(వినాయకనగర్), మే7(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కడప జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ జిల్లా సెక్రటరీ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప నగరం మట్టి పెద్దపులి సర్కిల్‌లోని జిల్లా కార్యాలయంలో నేడు ఉదయం 8.30కు జరగబోయే ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ సభ్యులు, రెడ్ క్రాస్ వలంటీర్స్ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

తాగునీటి కోసం బిందెలతో నిరసన



వేంపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో రాజీవ్‌కాలనీ ప్రజలు నిరసన తెలిపారు. ఆరు నెలలుగా తాగునీరు సక్రమంగా రావడం లేదు ఎలా అంటూ అధికారులను ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం ఖాళీబిందెలతో రాజీవ్‌కాలనీ నుంచి పంచాయతీ కార్యాలయానికి చేరుకొని తమ నిరసనను తెలిపారు. వెంటనే తాగునీరు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పులివెందుల డీఎల్‌పీఓ రమాదేవి, ఈఓ రామసుబ్బారెడ్డిలు మహిళలతో మాట్లాడారు. సమస్య గురించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు, ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రస్తుతమున్న బోరులో పైపులు వేయించి నీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఈఓ తెలిపారు.

వెయ్యినూతులకోన ఆలయంలో జలాధివాసం

పెండ్లిమర్రి, మే 7 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వెయ్యినూతులకోన ఆలయంలో జలాధివాసాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయాన్నే వేదపారాయణం, రాజగోపుర ధ్వజస్తంభ శిఖర విమాన కలశ చాయాధివాస కర్మాంగ స్నపనం నిర్వహించారు.భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని వేదపారాయణంలో పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇచ్చేందుకు చర్యలు

వేంపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి వేతనాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పులివెందుల డీఎల్‌పీఓ రమాదేవి, ఈఓ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఐదు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్న సిబ్బందికి వారి అకౌంట్లలో వేతనాలు జమచేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. అలాగే రెండు నెలలుగా వేతనాలకు నోచుకోని సచివాలయ ఉద్యోగులకు వేతనాలు విడులయ్యేలా ఈఓ చర్యలు తీసుకున్నారు. కాగా పంచాయతీలో పనిచేసిన ఉద్యోగులకు అవినీతి ఆరోపణలపై ఫిర్యాదులు వెళ్లడంతో డీఎల్‌పీఓ రమాదేవి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. పూర్తి విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని డీఎల్‌పీఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): కడప - తాడిపత్రి జాతీయ రహదారిలో వల్లూరు నుంచి కమలాపురం వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం కుమారునిపల్లె సబ్‌స్టేషను వద్ద యూటర్న్ తీసుకుంటున్న సమయంలో కమలాపురం వైపు నుంచి కడప వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడం జరిగింది. ద్విచక్ర వాహనదారుడుకి గాయాలయ్యాయి. కాగా ద్విచక్రవాహనదారుడు వల్లూరు గ్రామవాసి శ్రీనుగా గుర్తించారు. స్థానికులు వైద్య సహాయ నిమిత్తం 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


కేసీకి నీరు వదిలితే ఇబ్బందులు : కేసీ కెనాల్ ఏఈ

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 7 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో కూడా కేసీకెనాల్‌కు సాగునీటిని వదిలితే వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు తగినంత నీరు అందించే పరిస్థితులు ఉండవని కేసీ కెనాల్ ఏఈ గంగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న తడులు లేక తల్లడిల్లిన రైతన్నలు అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి స్పందించారు. ఏప్రిల్ 20 వరకు కేసు ద్వారా సాగునీరు అందుతుందని అంశాన్ని ముందు గానే రైతులకు తెలియ పరిచామని పేర్కొన్నారు. ప్రస్తుతం కాల్వలో పూడిక తీత పనులు జరుగుతున్నందువల్ల సాగునీరు ఇవ్వలేమని వివరించారు. కొంత మంది రైతుల కోసం నీటిని విడుదలచేస్తే ఖరీఫ్ సాగునీటికి ఇబ్బంది అవుతుందన్నారు.

రేపు ఏపీటీఎఫ్ నిరసన

కడప ఎడ్యుకేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో ప్రభుత్వం తీసుకువస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9వ తేదీ ఉదయం 10గంటలకు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామసుందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాలో పెద్దఎత్తున జిల్లాలోని ఉపాధ్యాయని, ఉపాధ్యాయు లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చక్రాయపేట ఎస్ఐగా చంద్రశేఖర్



చక్రాయపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట ఎస్ఐగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కృష్ణయ్య బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో బ్రహ్మంగారిమఠం నుంచి ఎస్ఐగా చంద్రశేఖర్ వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

చెన్నూరు సర్వేయరుగా ఖాజాహుస్సేన్



చెన్నూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల సర్వేయరుగా ఖాజాహుస్సేన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సర్వేయరు సోమశేఖర్ కడప ఏడీ ఆఫీసుకు బదిలీ కావడంతో అక్కడ పనిచేసే ఖాజాహుస్సేన్ చెన్నూరు రావడం జరిగింది. ఈ సందర్భంగా బదిలీపై వచ్చిన సర్వేయరు మాట్లాడుతూ రైతుల సమస్యలు సకాలంలో తీరుస్తానన్నారు.

తామర గింజలతో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



వేంపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని తామరగింజలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి దేవి జయంతి పురస్కరించుకొని బుధవారం ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తహసీల్దార్ హరినాథరెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, యువజన సంఘం నాయకులు రాయవరం సుబ్బు, మహిళా మండలి ప్రతినిధులు బాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

కమలాపురం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమాదేవి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె తనిఖీ చేశారు. హాజరు పట్టికను, పలు రకాల దస్త్రాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ తక్కువగా ఉన్నారని, భర్తీ చేయాలని ఆమె దృష్టికి తేవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్టాఫ్ భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు





చెన్నూరులో వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు, కడపలో గురుపూజ నిర్వహిస్తున్న దృశ్యం

సీకేదిన్నె, మే 7 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలంలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. మండలంలోని బయనపల్లె లో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు , అన్నదాన కార్యక్రమాలు, కోలాటం, చెక్కభజనల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. మూలవంక బ్రహ్మంగారి ఆలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం, గ్రామోత్సవాలను నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి..: నందిమండలం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి.పూజారులు ఉదయాన్నే స్వామి వారికి కుంకుమార్చన,అభిషేకాలు నిర్వహించారు.వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

చెన్నూరు..: చెన్నూరు శివాలయం వీధిలో కొలువై ఉన్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మంగారి స్వామి ఆరాధనఉత్సవాల సందర్భంగా బుధవారం విశేష అభిషేకాలు, పూజలు అలంకరణ జరిగాయి. తెల్లవారనుజాము నుంచే ప్రజలు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివెళ్లి పూజలు నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం గోవిందమాంబ సమేతవీరబ్రహ్మంగారిని ఊరేగించారు.

కడప కల్చరల్..: వీరబ్రహ్మేంద్రస్వామి జీవసమాధి గావించిన పవిత్ర సుదినం సందర్భాన్ని పురస్కరించుకుని నగర మునిసిపల్ మైదాన సమీపంలో వెలసిన గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయంలో బుధవారం కన్నుల పండువగా స్వామివారి ఆరాధన, గురుపూజ మహోత్సవాలు నిర్వహించారు. తెల్లవారుజామున 5-30 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పలు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12-30 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

11న పెద్దమ్మ జాతర

మైలవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 11వ తేదీ ఆదివారం పెద్దమ్మజాతర నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. 10వ తేదీ శనివారం అమ్మవారిని నిలుపుట, 11వ తేదీన గండదీపాలు, బోనాలు, మొక్కుబడులు, దీనబండారు ఇచ్చుట తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

స్పీడ్ బ్రేకర్ల తొలగింపు

జమ్మలమడుగు, మే 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టణంలోని ప్రధాన రోడ్లపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను బుధవారం తొలగించారు. తేరు రోడ్డు వద్ద నుంచి పెద్దపసుపుల మోటు, అర్బన్ పోలీసు స్టేషన్ ఎదురుగా, సంజాముల మోటు, ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా అనేక చోట్ల ఉన్న ఈ స్పీడ్ బ్రేకర్లను తొలగించారు. ఈనెల 17న రథోత్సవం నిర్వహించనున్న దృష్ట్యా ఈ కార్యక్రమానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా స్పీడ్ బ్రేకర్ల తొలగింపు చర్యలు చేపట్టారు. రోడ్డు క్లియరెన్స్, భద్రత ఏర్పాట్లపై సంబంధిత అధికారులు, పోలీసులు, ఆలయ అధికారులు చర్యలలో నిమగ్నమయ్యారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

బ్రహ్మంగారిమఠం, మే 7(ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా వచ్చే భక్తులకు టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, టీడీపీ యువ నాయకుడు కాణాల మల్లికార్జునరెడ్డి ఆర్థికసాయంతో మజ్జిగ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో వెల్లటూరు సాంబశివారెడ్డి, రేకలకుంట్ల శివ, గుజ్జు రామాంజనేయులు, పోలయ్య, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుండి వెల్లాల బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాజుపాలెం, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన వెల్లాల సంజీవరాయస్వామి, చెన్నకేశవ భీమలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు రేపటి నుండి ప్రారంభిస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి వెంకటరమణ తెలిపారు. 9న కల్యాణం, 10న సింహవాహనం, 11న హనుమంతోత్సవం, 12న గరుడ వాహనం, 14న స్వామివారి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేపటి నుండి పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



కాశినాయన, మే7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టిగుంట గ్రామంలో శుక్రవారం నుండి మూడు రోజుల పాటు నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. పోలేరమ్మ, భైరవ స్వామి, నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠలు ఉంటాయని, చివరిరోజు ఆదివారం రాములవారి కల్యాణం ఉంటుందన్నారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, గ్రామోత్సవాలు, అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వైభవంగా వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి జయంత్యుత్సవం

ప్రొద్దుటూరు టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): అమ్మవారిశాలలో బుధవారం అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, మహాప్రాకార ప్రదక్షణం, పుణ్యహవాచనం, సప్తశతి పారాయణం, విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి రంగురంగుల గజమాలలతో శోభాయమానంగా అలంకరించారు. పూజల అనంతరం గణపతి, నవగ్రహ, రుద్రహోమం, చండీహోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు సామూహికంగా అమ్మవారికి లక్ష కుంకుమార్చన, పసుపు, కుంకుమ, దీపాలు, నైవేద్యంతో అమ్మవారిని అర్చించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి కాయకర్పూరం సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు, మే 7 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, వైశ్య పతాకావిష్కరణ, అల్పాహార విందు, మహాగణపతిపూజ, స్వస్తిపుణ్యాహక వాచనం, కలశస్థాపన, కుంకుమార్చన, మహామంగళ హారతి, ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు మల్లెకొండు సుబ్రమణ్యం, కమిటీ ఆధ్వర్యంలో జరిగింది.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల, మే 7(ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో బుధవారం అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి గుడి ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు విశ్వనాదుల ప్రసాద్, ఆర్యవైశ్య మహిళా సంఘం, యువజన సంఘం పాల్గొన్నారు.

కలసపాడులో..

కలసపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): కలసపాడులోని వాసవి కన్యకపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం జరిగిన సంకీర్తనలో ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం గణపతి పూజ, నగరేశ్వరస్వామి, సాయంత్రం కుంకుమార్చన, భజనలు, రథోత్సం కార్యక్రమాలు నిర్వహించారు.



కలసపాడులో..

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ తోడ్పాటు : భూపేశ్‌రెడ్డి



టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్నివిధాల తోడ్పాటు అందిస్తుందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి తెలిపారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 90రోజుల పాటు జరిగే కుట్టుమిషన్ శిక్షణాకార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ కోసం వచ్చే మహిళలు ఇబ్బంది పడకుండా తమ ట్రస్టు తరపున ప్రతిరోజు ఉచితంగా మజ్జిగ, బిస్కట్లను అందజేస్తామన్నారు. గండికోట ముంపువాసులు సర్వం కోల్పోయారని, వారికి ఉపాధి కల్పించేందుకు మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమ ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి మండల ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, ఎంపీడీవో నాగప్రసాద్, శిక్షణా కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర రెడ్డి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై మున్సిపల్ కార్మికుల నిరసన



ర్యాలీ నిర్వహస్తున్న మున్సిపల్ కార్మికులు

బద్వేలు, మే7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా బుధవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు, పొట్టిశ్రీరాములు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ గత సమ్మెకాలపు వేతనం మంజూరు చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన రక్షణ పరికరాలను సైతం ఇచ్చేందుకు అనుమతులు లేవని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ నాగేంద్రబాబు, పట్టణ అధ్యక్షుడు శ్యామ్ ప్రవీన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవం

ముద్దనూరు మే 7(ఆంధ్రజ్యోతి):స్థానిక బ్రహ్మంగారి మఠంలో బుధవారం ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మంస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

‘దేశం యావత్తు గర్వపడేలా ఉంది’



పోరుమామిళ్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ తీవ్రవాద శిబిరాలపై ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ తొమ్మిదిచోట్ల దాడులు చేసి తీవ్రవాదులను మట్టుబెట్టడం దేశం యావత్తు గర్వపడేలా ఉందని మాజీ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ భారత్ భూభాగంలోని బార్డర్‌లో ఉన్న గ్రామాలపై లాంచర్లతో దాడులు చేయడం జరుగుతుందని భారత్ కేవలం తీవ్రవాద స్థావరాలపైమాత్రమే దాడులు చేసిందన్నారు. ప్రజల నివాస స్థలాలపై సైన్యం దాడి చేయలేదని, పాకిస్తాన్ మాత్రం కవ్వింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. భారత్, మోదీపై ప్రతీకారం తీర్చుకుంటామని మసూద్ హెచ్చరికలు చూస్తుంటే పాకిస్థాన్ తీవ్రవాదులకు నిలయంగా మారిందన్నారు. భారత్ సైనికులకు 140 కోట్ల ప్రజల సంపూర్ణ మద్దతు ఉందని, ప్రపంచ దేశాల మద్దతు కూడా ఉందన్నారు.

సత్తా చాటిచెప్పిన ఇండియన్ ఆర్మీ

ఖాజీపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీ సత్తాను ప్రపంచ దేశాలకు చాటిచెప్పిందని ఆర్టీసీ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ టూరిజాన్ని దెబ్బతీసేందుకు, భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు పహల్గామ్‌లో ఉగ్రదాడి చేశారని, ఇది కిరాతకమైన చర్య అన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో దుంపలగట్టు గ్రామంలో ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టి ఇండియా ఆర్మీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రజలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

‘ఆడపిల్లలను చదివించి రక్షించాలి’

రాజుపాలెం, మే 7(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను చదివించి రక్షించాలని మహిళా పోలీసు తులసి అన్నారు. మండల పరిధిలోని టంగుటూరు నాలుగో అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం-వేసవి సెలవులు అనే కార్యక్రమంలో భాగంగా 12 నుండి 14 సంవత్సరాలు, అలాగే 15 నుండి 18 సంవత్సరాల కిశోరి బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. రుతుస్రావం, పరిశుభ్రత, పోషకాహారం, రక్తహీనత నివారణ, చదువువంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ప్రసన్న క్రిష్ణవేణి, అంగన్వా టీచర్లు లక్ష్మి, లక్ష్మీదేవి, మణి పాల్గొన్నారు.

బి.కోడూరు ఎస్‌ఐగా వెంకట సురేశ్



బి.కోడూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండలం ఎస్‌ఐగా పి.వెంకటసురేశ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీపీ రాజు ప్రొద్దుటూరు రూరల్ స్టేషనుకు బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న వెంకటసురేశ్ బి.కోడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

జమ్మమడుగు, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాన వులపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు బాలాజీ (45) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డకు చెందిన బాలాజీ టాటాబిర్లా కంపెనీలో అడ్వయిజర్‌గా పనిచేస్తున్నాడని, విధులు ముగించుకుని ప్రొద్దుటూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. ముందు వెళ్తున్న లారీ ట్యాంకర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పి కిందపడిపోవడంతో గాయాలయ్యాయని తెలిపారు. వెంటనే 108వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. ఎస్‌ఐ హైమావతి మృతదేహాన్ని సందర్శించి వివరాలు విచారించారు.

‘సమస్యలు మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం’

పోరుమామిళ్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో పారిశుధ్యానికి సంబంధించి కానీ, తాగునీటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తామని పంచాయతీ కార్యనిర్వాహణాధికారి రవిశంకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పోరుమామిళ్లలోని శివాలయానికి వెళ్లే దారిలో కొలిమి వద్ద నీరు నిలిచింది.. అనే విషయం ఆయన దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి పారిశుధ్య కార్మికులతో రోడ్డుపై ఉన్న నీటిని మళ్లించి చుట్టుపక్కల బ్లీచింగ్‌పౌడరు చల్లించి చెత్తచెదారాలను తొలగించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీచెన్నకేశవస్వామి మహోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిరసవంచ గ్రామంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వృషభరాజముల బండలాగుడు పోటీలను టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ప్రారంభించారు. అలాగే గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఖాజీపేట అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, బి.మఠం నేతలు చెన్నారెడ్డి, మేకల సుధాకర్, నాగయ్య, గంగరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నజరుల్లా దర్గా ఆస్తుల అభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు టౌన్, మే7 (ఆంధ్రజ్యోతి): నజరుల్లా దర్గా ఆస్తుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆ దర్గా కమిటీ కార్యదర్శి, న్యాయవాది దాదాపీర్ పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది నజరుల్లా శిష్యులమని, దర్గా ఆస్తుల్లో తమకు హక్కు ఉందని కోర్టుకు ఆశ్రయించగా న్యాయస్థానం ఆ పిటీషన్‌ను తిస్కరించిందన్నారు. దర్గా ఆస్తులు రాజకీయ నాయకుల జోక్యంతో అన్యాక్రాంతమవుతున్నాయని ప్రచారం చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నజరుల్లా షా దర్గా కమిటీ అధ్యక్షుడు ఇనాయతుల్లా, కోశాధికారి నూరుల్లా, సభ్యులు పాల్గొన్నారు.

కన్నులపండువగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

గోపవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం 17వ వార్షికోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని రాచాయిపేట శివార్లలో వెలసిన అభయాంజనేయస్వామిని పలు పూలమాలలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో రవిచంద్రరెడ్డి, సుందరరామిరెడ్డి, శివారెడ్డి, సాంబశివారెడ్డి, సుబ్బరాయుడు భక్తులు పాల్గొన్నారు.



గ్రామోత్సవం వెంట కోలాటం చేస్తున్న దృశ్యం

ప్రధాన రోడ్డు పక్కన నిలిచిన లీకేజీ నీరు



లీకేజీ నీటితో స్థానికుల ఇక్కట్లు

జమ్మలమడుగు, మే 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం మోరగుడి మూడు రోడ్ల కూడలి సమీపాన కరెంటు ఆఫీసు ఎదురుగా ప్రధాన గేటు నుంచి మూడు రోడ్ల కూడలి వరకు పైపుల లీకేజీ నీరు ప్రవహిస్తోందని స్థానికులు వాపోతున్నారు. తమ దుకాణాల ఎదుట నీరు నిలిచి ఉండటంతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వర్షం వస్తే మరింత నీరు నిలిచే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి పైపులకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అల్లూరి స్ఫూర్తితో ఉక్కు కోసం పోరాటం

● డీవైఎఫ్‌ఐ

జమ్మలమడుగు, మే 7 (ఆంధ్రజ్యోతి): నేటి యువత అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకుని కడప ఉక్కుకోసం పోరాటాలు సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్జీవో హోంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశస్వాతంత్య్రం కోసం ప్రాణాలను అర్పించిన మహావీరుడు అల్లూరి అని, యువతకు ఆయన స్ఫూర్తి ప్రదాత అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు కృష్ణారెడ్డి, అరుణ్, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందించాలి

జమ్మలమడుగు, మే 7 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమస్యలు లేకుండా ఉచిత విద్యుత్ అందించాలని బీజేపీ జమ్మలమడుగు చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు సిలివేరి వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు బుధవారం కడప, జమ్మలమడుగు ప్రాంతాల్లో విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో నాలుగు వేల రూపాయలకు పైగా అద్దె ఇంటిలో ఉండే కార్మిక కుటుంబాలు ఉన్నాయన్నారు. 200 యూనిట్లు చేతివృత్తి నేత కార్మికులకు, పవర్‌లూమ్ కార్మికులకు 500యూనిట్లు ఉచిత విద్యుత్ నమోదు పక్రియ ప్రారంభమైందని, ఆ దిశగా అధికారులు చేనేత కార్మికులకు ఇబ్బందులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ మీటర్లు ఇంటిలో ఏదో ఒక కుటుంబ సభ్యుని పేరుపై ఉంటుందని, అందరికి ఉచిత విద్యుత్తు అందించాలని ఆయన కోరారు.

చెన్నారెడ్డిపల్లెలో సీఐ పల్లెనిద్ర

కలసపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు కలసపాడు మండలం చెన్నారెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడుతూ వేసవిలో మిద్దెలపై నిద్రపోతున్నప్పుడు దొంగలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచంచారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని, చిన్నపిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఇంటి వద్ద ఉంటున్నారని, వారిపై దృష్టిపెట్టి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి

ప్రొద్దుటూరు, మే 7(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సాయి కుటీర్ రోడ్డులోని ఆయన స్వగృహంలో మాట్లాడుతూ 90 శాతం ఈకేవైసీ కూడా పూర్తయిందన్నారు. స్మార్ట్ కార్డులు కూడా త్వరలో మంజూరు చేస్తారన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రేషన్ కార్డు పొందడం వల్ల అనేక సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వండి : ఎంపీపీ

బి.కోడూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పది గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులలో తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని, 60 శాతం తాగునీటికి, 40 శాతం వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని ఎంపీపీ కోడూరు చెన్నమ్మ తెలిపారు. బుధవారం స్థానిక సభాభవనంలో ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కౌశిక మాట్లాడుతూ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ఈనెల 20న విడుదల చేయనుందని తెలిపారు. చిన్న గాలివర్షానికే విద్యుత్ తీగలు తెగి పడుతున్నాయని సభ దృష్టికి తీసుకురావడంతో ఏఈ మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, కొంత సమయమిస్తే అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దారు మాట్లాడుతూ రేషన్ బియ్యం అందాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ సభలో సభ్యులు అడిగినవన్నీ కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఇతర అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : సీఐ

కాశినాయన, మే 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని పోరుమామిళ్ళ సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఓబుళాపురం మూడురోడ్ల కూడలిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగా లేని, నిబంధనలు అతిక్రమించి వాహనాలను నడిపిన పలువురికి జరిమానా విధించారు.

వర్షంతో తడిసిన పంట దిగుబడులు

దువ్వూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండల పరిధిలో పడిన వర్షం రైతుల్లో కలకలం రేపింది. మంగళవారం రాత్రి పొద్దుపోయాక వర్షం ప్రారంభమైంది. చాలామంది రైతులు సాగు చేసిన పంటల దిగుబడులను తొలగించి వారికి అనుకూలమైన ప్రదేశాల్లో ఆరబెట్టారు. దువ్వూరు ప్రాంతంలో మొక్కజొన్న పొత్తులు, వేరుశనగ, పసుపు, అరకొరగా వేసిన ధాన్యం పంటలను రోడ్లమీద ఆరవేశారు. వ్యయ ప్రయాసలకోర్చి సాగు చేసిన పంటలు చేతికంది ఇలా వర్షంతో తడవడం రైతుల్లో గుబులు రేపింది. దీంతో కొంత నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షం అన్నదాతను ఇబ్బందిపెట్టిందని వాపోయారు. దువ్వూరులో 23.2మి.మీ. వర్షపాతం నమోదైంది.



తడిసిన ధాన్యం